ట్రస్మా డివిజన్, పట్టణ కార్యవర్గం ఎన్నిక

ట్రస్మా కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబర్ 29: ట్రస్మా పట్టణ, డివిజన్ కార్యవర్గాన్ని మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ట్రస్మా పట్టణ అధ్యక్షుడిగా బొడ్డు పల్లి వరప్రసాద్, కార్యదర్శిగా ఓరుగంటి శ్యాంసుందర్, కోశాధికారిగా పాశం శ్రీధర్‌రెడ్డి, మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడిగా కందాళ శ్రీనివాస్‌చారి, కార్యదర్శిగా కందిమళ్ల దామోదర్, కోశాధికారిగా సాలెం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు వంగాల నిరంజన్‌రెడ్డి, శ్రీరామకవచం నాగరాజు, అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, రామ్మోహన్, రవీందర్‌రెడ్డి, రాములు, పొలగాని సాయిశ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ బియ్యం అందేలా చూడాలి

- ఎమ్మెల్యే బాలూనాయక్

గోదామును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), అక్టోబర్ 29 : అర్హులైన వారందరికీ రేషన్ బియ్యం అందేలా చూడాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ సూచించారు. మంగళవారం దేవరకొండ మార్కెట్ యార్డులోని స్టేజి-2 గోదామును ఆయన పరిశీలించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దేవరకొండ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 90 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పౌర సరఫరాల శాఖ అధికారి హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ అరుణాసురేశ్‌గౌడ్, నాయకులు సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీలు జాన్‌యాదవ్, భవానీపవన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

పక్షవాతంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారావు

ర్యాలీని ప్రారంభిస్తున్న గోనారెడ్డి, డాక్టర్ పుల్లారావు

నీలగిరి, అక్టోబర్ 29 : మారుతున్న జీవన శైలితో ప్రజలు స్ట్రోక్(పక్షవాతం) బారిన పడుతున్నారని, దీనిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి నివారణకు కృషి చేయాలని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు అన్నారు. మంగళవారం ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా స్థానిక రివర్ నిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 5కే వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎన్‌జీ కళాశాల వద్ద కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డితో కలిసి ఆయన జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశంలో అత్యధికంగా సంభవిస్తున్న మరణాలకు రెండో అతిపెద్ద కారణం స్ట్రోక్ అన్నారు. వయసుతో సంబంధం లేకుండా యువత కూడా దీని బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శారీరక శ్రమ చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, రక్తపోటు, బ్లడ్ గ్లూకోజ్ నియంత్రణంలో ఉంచుకోవడం ద్వారా దీని బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వాకింగ్ అసోసియేషన్ నాయకులు బండారు ప్రసాద్, లయన్స్‌క్లబ్ సభ్యుడు కట్టా అనంత రెడ్డి, రివర్ నిమ్స్ ఆస్పత్రి వైద్యులు వెంకట్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాజేశ్ రెడ్డి, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ వీరారెడ్డి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో పరిశుభ్రత పాటించాలి

- డీడీఎం పద్మావతి

నిమ్మ మార్కెట్‌ను పరిశీలిస్తున్న పద్మావతి

నకిరేకల్, అక్టోబర్ 29 : నకిరేకల్‌లోని వ్యవసాయ మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్, నకిరేకల్ మార్కెట్ పర్సనల్ ఇన్‌చార్జి వై.పద్మావతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నకిరేకల్ పట్టణంలోని నిమ్మమార్కెట్‌ను ఆమె తనిఖీ చేశారు. మార్కెట్ ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేబ్రిడ్జిని ఎందుకు నిరుపయోగంగా ఉంచారని ప్రశ్నించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎంట్రన్స్ గేట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తక్‌పట్టీల రికార్డులు సరిగా నిర్వహించాలని సూచించారు. దీపావళి తర్వాత పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. ఆమె వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనాథ్‌రాజు, సూపర్‌వైజర్లు కిషన్ బహదూర్, వెంకన్న, జెఎంఎస్ సుధాకర్ ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వసతులు, రికార్డులను పరిశీలించారు. రోగులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారు ఆయుష్మాన్ భారత్ కార్డు పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కేశ రవి, మండల వైద్యాధికారి ఉషారాణి, సీహెచ్ఓ సుగుణబాయ్, హెల్త్ సూపర్‌వైజర్ రాణి, సిబ్బంది లక్ష్మణ్, హరీశ్ పాల్గొన్నారు.

నాగరాజుకు వల్లభాయ్‌పటేల్ పురస్కారం

నార్కట్‌పల్లి, అక్టోబర్ 29 : మండల కేంద్రానికి చెందిన దైద నాగరాజుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారం లభించింది. సూర్యాపేటకు చెందిన హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధూ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఆయనకు పురస్కారాన్ని అందించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 6304222202.
NT-338782

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

జనవరి 1 నుంచి వార్షిక ఓటరు జాబితా సవరణ

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మంత్రి కోమటిరెడ్డికి మొక్కను అందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబర్ 29: జనవరి1, 2025 నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా వార్షిక ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం కలెక్టర్ కార్యాలయంతో పాటు ఆర్డీఓ, ఏఈఆర్ఓ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 29 నుంచి వచ్చే నెల 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, నవంబర్ 9. 10 తేదీల్లో సవరణ కార్యక్రమంపై ప్రత్యేక ప్రచారం, బీఎల్ఓలు తమ పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి తప్పుల సవరణకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. వాటిని డిసెంబర్-24 వరకు సరిచేసి జనవరి6న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన కలెక్టర్

నీలగిరి : రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంగళవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతలు, ప్రభుత్వ పథకాల అమలుతీరు, అభివృద్ధిపై మంత్రి వారితో చర్చించారు. నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి కూడా మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో జిల్లా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ సబ్సిడీ నిధులు విడుదల చేయాలి

మిర్యాలగూడ, అక్టోబర్ 29: రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రూ.265కోట్ల ట్రైకార్ సబ్సిడీ నిధులను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ డీఏఓ శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 32,122 మంది లబ్ధిదారులకు రూ.265కోట్ల ట్రైకార్ సబ్సిడీ రుణాలు మంజూరు చేసి నూతన యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నం.49ను రద్దు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ వల్లంపట్ల వెంకన్న, నాయకులు రాహుల్, సైదానాయక్, శివతేజ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ వాసికి డాక్టరేట్

డాక్టరేట్ అందుకున్న కుర్రె భాస్కర్

మిర్యాలగూడ, అక్టోబర్ 29: మిర్యాలగూడకు చెందిన కుర్రె భాస్కర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. స్టాటిస్టిక్స్ విభాగంలో 'ప్రిడిక్షన్ ఆఫ్ అండర్ ఫైవ్ మోర్టాలిటీ రేట్స్ ఆఫ్ ఇండియా, కంపారేటివ్ ఎనాలిసిస్ ఆఫ్ అరిమా అండ్ ఆర్టిఫిషల్ న్యూరల్ నెట్వర్క్ మోడల్స్' అంశంపై డాక్టర్ ఎం రాఘవేందర్ పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ లభించింది. ఆయన ప్రస్తుతం ఆర్‌వీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో స్టాటిస్టిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. భాస్కర్‌కు డాక్టరేట్ రావడంపై విద్యావేత్తలు, మిత్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీడీఓకు సన్మానం

ఎంపీడీఓ పూజను సన్మానిస్తున్న కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది

మునుగోడు, అక్టోబర్ 29 : బదిలీపై వెళ్తున్న మునుగోడు ఎంపీడీఓ కె. పూజను మంగళవారం కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీఓగా సూపరింటెండెంట్ భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, కార్యదర్శులు సంఘం అధ్యక్షుడు రమశ్, ఇన్‌చార్జి ఏపీఓ ఇండ్ల నాగరాజు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు :సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, అక్టోబర్ 29: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో దుర్మార్గమైన, రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. ప్రజల సంపదను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రజలపై ధరల భారాన్ని మోపుతుందని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు పాల్గొన్నారు.

సమగ్ర కులగణనపై నేడు సమావేశం

మిర్యాలగూడ, అక్టోబర్ 29: సమగ్ర కులగణన సర్వే నవంబర్ 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమవుతున్న సందర్భంగా పట్టణంలోని అన్ని బీసీ కుల సంఘాలతో బుధవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఎన్ఎస్పీ గెస్ట్‌హౌస్‌లో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన సర్వేలో భాగంగా నవంబర్ 4న బీసీ కమిషన్ నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై బీసీ సంఘాలు విన్నవించాల్సిన అవసరం ఉందన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో నల్లగొండ జట్టు విజయం

మిర్యాలగూడ, అక్టోబర్ 29: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లియో స్పోర్ట్స్‌లో జరుగుతున్న సీనియర్ జిల్లాస్థాయి వన్ డే లీగ్ టోర్నమెంట్‌లో మంగళవారం నల్లగొండ, అచ్చంపేట జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. ఇందులో నల్లగొండ జట్టు విజయం సాధించినట్లు జిల్లా కోచ్ కావలి వెంకన్న తెలిపారు. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన అచ్చంపేట జట్టు 13.2 ఓవర్లలో 61 పరుగులకే ఆలౌట్ కాగా నల్లగొండ జట్టు 7.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా టార్గెట్‌ను పూర్తి చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముజఫర్, సాయికృష్ణ, శంకర్, రాజునాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నిడమనూరు, అక్టోబర్ 29 : మండలంలోని వేంపాడు శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుండెబోయిన చిన్నమట్టయ్య (59) రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కూలిపనులు ముగించుకొని బైక్‌పై హాలియా నుంచి మునగబావిగూడెం వస్తుండగా కారు ఢీకొనడంతో చిన్నమట్టయ్య, మొగులయ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. చిన మట్టయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఉపాధ్యాయుడు మహేశ్‌కు యంగ్ ఇండియన్ పురస్కారం

పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు మహేశ్

నాంపల్లి, అక్టోబర్ 29 : మండలంలోని దామెర ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గురిజ మహేశ్‌కు యంగ్ ఇండియన్ సేవా పురస్కార్ అవార్డు లభించింది. ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో మౌలిక వసతులు కల్పించడం, పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహకారం, దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు , తల్లిదండ్రులు లేని, నిరాదరణకు గురైన విద్యార్థులకు చదువులో సహకారం, గ్రామీణ నిరుద్యోగులకు పోటీ పరీక్షల్లో మార్గదర్శకత్వం అందజేడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు పురస్కారం అందించినట్లు యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా మహేశ్ అవార్డు అందుకున్నారు.

చండూరు ఇన్‌చార్జి ఆర్డీఓగా శ్రీదేవి

చండూరు, అక్టోబర్ 29 : చండూరు ఇన్‌చార్జి ఆర్డీఓగా శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం వనపర్తి ఆర్డీఓగా బదిలీపై వెళ్లారు. దాంతో నల్లగొండ కలెక్టరేట్‌లో ప్రత్యేక భూ పరిపాలనా కలెక్టర్ పీఏగా పని చేస్తున్న శ్రీదేవికి ఇన్‌చార్జి ఆర్డీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ట్రాలీ ఆటోను ఢీకొట్టిన లారీ..ముగ్గురికి గాయాలు

వేములపల్లి, అక్టోబర్ 29: మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మంగళవారం ట్రాలీ ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా కోనూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన పగిడిపత్తి నర్సయ్య, ఉయ్యాల రమేశ్, దొడ్లేరుకు చెందిన ఖాసీం పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో పండ్లు కొనుగోలు చేసి మంగళవారం ఉదయం ట్రాలీలో స్వగ్రామానికి బయల్దేరారు. శెట్టిపాలెం గ్రామ శివారులో ట్రాలీ ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. దాంతో ఆటో బోల్తా పడగా ఆటోలో ప్రయాణిస్తున్న నర్సయ్య, ఖాసీం, డ్రైవర్ బాజీసైదాకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి : సీపీఎం

చందంపేట, అక్టోబర్ 29 : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పెండింగ్ ప్రాజెక్టును పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గాగిళ్లాపురంలో మంగళవారం నిర్వహించిన పార్టీ 6వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు నారి అయిలయ్య, కంబాలపల్లి ఆనంద్, శ్రీనయ్య, రాములు, పెద్దయ్య, ఈశ్వరయ్య, కాశయ్య, లక్ష్మయ్య, అలివేలు పాల్గొన్నారు.

దేవరకొండ ఆర్డీఓగా రమణారెడ్డి

చందంపేట(దేవరకొండ), అక్టోబర్ 29 : దేవరకొండ ఆర్డీఓగా రమణారెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్డీఓగా పని చేసిన శ్రీరాములు గోదావరిఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీసీ గర్జన సభను విజయవంతం చేయాలి :బీసీ జేఏసీ

బీసీ గర్జన సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ, అక్టోబర్ 29: నవంబర్ 3న పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్వహించే బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ కన్వీనర్ తమ్మడబోయిన అర్జున్, నాయకులు కోల సైదులు ముదిరాజ్, దాసరాజు జయరాజు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక జ్యోతిబా పూలే భవనంలో ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు గర్జన లకు తరలి రావాలన్నారు. రాజ్యాధికార సాధనే లక్ష్యంగా బీసీలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, పున్నా రాములు, ఆధారం మురళి, చేగొండి మురళీయాదవ్, ఇరుగు దిండ్ల గోవింద్, గంగుల భిక్షం, ఈశ్వరచారి, దుర్గయ్య పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలి

- మెప్మా రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్

నల్లగొండలో పచ్చళ్ల తయారీని పరిశీలిస్తున్న మెప్మా రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్

నీలగిరి/నకిరేకల్, అక్టోబర్ 29 : మహిళా సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని మెప్మా రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్ సూచించారు. మంగళవారం నల్లగొండ, నకిరేకల్ మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను మున్సిపల్ కమిషనర్లు సయ్యద్ ముసాబ్ అహ్మద్, బాలయ్యతో కలిసి ఆయన సందర్శించారు. ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌లో పిండివంటలు, పచ్చళ్ల తయారీ విధానాన్ని పరిశీలించారు. రోజువారి విక్రయాలు, ఖర్చులు, మార్కెటింగ్ వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా కోర్డినేటర్ శివాజీ, మెప్మా సిబ్బంది శ్రీనివాస్, నరసింహ, జ్యోతి, అనిల్, రాజు, ఆర్పీలు, నకిరేకల్‌లో మెప్మా ఏడీఎంసీ పద్మ, భార్గ సామి మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు.

రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ కుటుంబానికి రవీంద్రకుమార్ పరామర్శ

అబ్దుల్‌హాఖ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), అక్టోబర్ 29 : ఏపీజీవీబీ రిటైర్డ్ మేనేజర్, దేవరకొండ పట్టణానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ హాఖ్ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి అబ్దుల్ హాఖ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మహ్మద్ జానిబాబా, ఇలియాస్ పటేల్, సయ్యద్ హమీద్, జాఫర్, షఫీ, వడ్త్య బాలు ఉన్నారు.

విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని తరలించొద్దని వినతి

వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిడమనూరు, అక్టోబర్ 29 : మండల కేంద్రంలో ఉన్న విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ కార్యాలయం తరలింపును నిలిపివేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం తాసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కార్యాలయం, విత్తనశుద్ధి యూనిట్‌ను పూర్తి స్థాయిలో తరలించడం ద్వారా వాటి సేవలు రైతులకు దూరమవుతాయన్నారు. అత్యధికంగా వాటాదారులున్న నియోజకవర్గ రైతుల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన విత్తనశుద్ధి కర్మాగారం, గోదాం, రీజినల్ మేనేజర్ కార్యాలయాలను తరలించడంతో ఈ ప్రాంత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. వినతి పత్రం అందించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మెరుగు రామలింగయ్య, నల్లబోతు వెంకటేశ్వర్లు, అన్నెబోయిన కొండల్, గన్నె పాక లక్ష్మణ్, చామల యాదగిరిరెడ్డి, రాంబాబు, రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానివి దిగుజారుడు రాజకీయాలు

- మాజీ జడ్పీటీసీ లలితాహతీరాం

దామరచర్ల, అక్టోబర్ 29: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందని మాజీ జడ్పీటీసీ ఆంగోతు లలితాహతీరాం నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, ఈ విషయమై నిలదీస్తున్న ప్రతిపక్ష నాయకులపై కుట రాజకీయాలు చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బంధువుల ఇంట్లో దావత్ చేసుకుంటుంటే పోలీసులను ఉసిగొల్పి కేసులు పెట్టాలని చూడటం సిగ్గుచేటన్నారు. రాజకీయంగా కేటీఆర్, హరీశ్‌రావును ఎదుర్కొనలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే కుట్రలు

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలైనా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేదని, దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేటీఆర్ బంధువుల ఇండ్లపై దాడుల పేరుతో హల్‌చల్ చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకులు కేసాని లింగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేసినంత మాత్రాన ప్రజలు నమ్మరన్నారు.

డీ-22 గేటు ధ్వంసం

గుర్రంపోడ్, అక్టోబర్ 29: డీ-22 పరిధిలో కాల్వ మొదట్లో ఉన్న రైతులు ముందస్తుగా వరి సాగు చేయగా ప్రస్తుతం వారి చేలు కోత దశలో ఉన్నాయి. అయితే పొలాల్లో తడి ఉంటే వరికోత మిషన్లు పొలాల్లో దిగడం లేదని కొంత మంది రైతులు సోమవారం రాత్రి ఏకంగా డీ-22 కాల్వ గేటును ట్రాక్టర్లతో బలవంతంగా కిందికి దించారు. దాంతో గేటు ధ్వంసమైంది. గతేడాది రూ.1.5 లక్షల ఖర్చుతో కొత్త గేటును బిగించగా ప్రస్తుతం గేటు దెబ్బతింది. ఏఎమ్మార్పీ అధికారులు మంగళవారం చైన్‌బ్లాక్ సాయంతో గేటు ఎత్తారు. రైతులు గేట్ల జోలికి వెళ్లొద్దని, నీరు అవసరం లేకపోతే పొలాల వద్ద అడ్డుకట్టలు వేసుకోవాలని ఏఎమ్మార్పీ ఈఈ ఆనంద రావు,ఏఈ శ్రీనివాస్‌రావులు సూచించారు.

ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 29: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీరశేఖర్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని డొక్కలబావి గ్రామంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోను ఆపి జరిమానా విధించారు. ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

'మాదిగ జాతికి ద్రోహం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి'

మర్రిగూడ,అక్టోబర్ 29 : ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ జాతికి ద్రోహం చేస్తున్నారని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను అణగదొక్కాలని కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. నవంబర్ 4న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉమ్మడి నల్లగొండ జిల్లా మాదిగల ధర్మ యుద్ధం సదస్సుకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా తిరుమలేశ్ మాదిగ, జిల్లా కార్యదర్శి నల్లగంటి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బాల కార్మికులు

బాలకార్మికులను పాఠశాలలో చేర్పిస్తున్న హన్మంతు

చిట్యాల, అక్టోబర్ 29 : వట్టిమర్తి శివారులో గల హనుమాన్ ఇండస్ట్రీలో బిహార్‌కు చెందిన వలస కార్మికులు హమాలీ పనిచేస్తున్నారు. వారి పిల్లలు కూడా అక్కడే ఉండటాన్ని గమనించిన మిల్లు యజమాని తేరటుపల్లి హన్మంతు తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఐదుగురు పిల్లలను మంగళవారం చిట్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. వారికి బ్యాగులు, నోటు పుస్తకాలు, ప్లేట్లు అందించారు. పాఠశాల హెచ్ఎం సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

నార్కట్‌పల్లి, అక్టోబర్ 29 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి కేంద్రీకరించాలని ఎస్ఐ క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పీవీఆర్ చేతనస్కూల్‌లో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పుచ్చకాయల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిట్యాల, అక్టోబర్ 29 : ఉరుమడ్ల గ్రామానికి చెందిన గీతకార్మికుడు అనారోగ్యంతో మృతి చెందటంతో గౌడ కుల పెద్దలు మంగళవారం కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 21,200 అందజేశారు. ఉయ్యాల నాగరాజు, పెద్ద వెంకటయ్య, లింగస్వామి, సుంకరి శేఖర్, నర్సింహ పాల్గొన్నారు.

పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర సలహాదారుడిగా సూర్యనారాయణ



చౌటుప్పల్, అక్టోబర్ 29 : పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారుడిగా మండలంలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన వర్కాల సూర్యనారాయణ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయనను నియమించారు. ప్రస్తుతం ఆయన శ్రీశైలం నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.